సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



హరికథకు ఆద్యుడు ఆదిభట్ల
హరికథకు ఆద్యుడు ఆదిభట్ల నారాయణదాసు 159వ జయంతి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. - 8లో



అధునాతన అంబులెన్సులతో వైద్య సేవలు
అధునాతన అంబులెన్స్‌లతో ప్రభుత్వం అత్యవసర వైద్యసేవలందిస్తోంది. - 8లో



సోదర భావం టీచర్ల నుంచి అలవరచుకోవాలి
ఉపాధ్యాయులంతా సోదర భావంతో పనిచేయాలని డీఈఓ పిలుపునిచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

రామతీర్థంలో వైఖానస మహర్షి జయంతి



స్వామి సన్నిధిలో అర్చనలు జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో వైఖానస మహర్షి జయంతిని అర్చకులు గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా సీతారామస్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం, వెండి మంటపం వద్ద నిత్య కల్యాణ మహోత్సవాలను జరిపించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా సీతారామస్వామికి నూతన యజ్ఞోపవీతధారణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వైఖానస మహర్షి విగ్రహానికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫలరసాలతో అభిషేకాలు చేసి, పట్టు వస్త్రాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. వైఖానస కల్పసూత్రం, పారమాత్మిక ఉపనిషత్తు పారాయణాలు పూర్తి చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు పాల్గొన్నారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: సాధారణ ప్రజలకు తక్కువ ధరకే భోజన సదుపాయం కల్పించేలా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ–ఆంధ్రప్రదేశ్ (మెప్మా), పార్వతీపురం పురపాలక సంఘం సమష్టిగా పార్వతీపురం బెలగాం చర్చి సెంటర్లో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి, ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రతి మహిళను లక్షాధికారిగా చేసేందుకు ఆర్థిక తోడ్పాటునందిస్తున్నట్టు వెల్లడించారు. ఆహా క్యాంటీన్‌ను ఏర్పాటుచేసిన మహిళా సంఘ సభ్యులను అభినందించారు. తక్కువ ధరకే రుచికరమైన భోజనం వడ్డించి అందరి మన్ననలు అందుకోవాలని, వ్యాపారం చక్కగా సాగాలని ఆకాంక్షించారు. రాఖీపౌర్ణమిని పురస్కరించుకుని మహిళలందరూ ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇ.గున్నేశ్వరరావు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మెప్మా సభ్యులు, అధికారులు, ఆర్పీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో పుష్పశ్రీవాణి



మాజీ మంత్రి పుష్ప శ్రీవాణికి ప్రసాదం అందజేస్తున్న ఏఈవో భ్రమరాంబ

సింహాచలం: విశాఖలోని సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని మాజీ మంత్రి, కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి కుటుంబసమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని పుష్ప శ్రీవాణికి ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

గుణానపురంలో గజరాజుల అలజడి



మార్కొండపుట్టి గ్రామ సమీపంలో గజరాజు

కొమరాడ: గత వారం రోజులుగా ఆర్తాం, దుగ్గి, కళ్లికోట ప్రాంతాల్లో సంచరిస్తున్న ఏడు ఏనుగుల గుంపు బుధవారం రాత్రి గుణానపురం ప్రాథమిక పాఠశాలలోకి చొరబడేందుకు కిటికీని విరిచేశాయి. మరోవైపు ఒంటరి ఏనుగు పాతమార్కొండపుట్టి సమీపంలో సంచరిస్తోంది. రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు.

‘వాహనమిత్ర’తో

ఆర్థిక ఊతం

- వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ వాహనమిత్ర పథకం అమలుకు చర్యలు
- జిల్లాలో 4,607 మంది లబ్ధిదారుల గుర్తింపు
- వాహన యజమానులకు రూ.10వేలు ఆర్థిక సాయం
- జిల్లాలోని లబ్ధిదారులు రూ.4.6 కోట్ల లబ్ధిపొందే అవకాశం



ప్రజాసంకల్పయాత్రలో జగనన్నతో కలిసి నడుస్తున్న ఆటో డ్రైవర్లు (ఫైల్)

పార్వతీపురం టౌన్:

ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న డ్రైవర్లకు రవాణా శాఖకు సంబంధించిన ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక ఊతం అందిస్తోంది. ఇది వారికి ఎంతో ఊరటనిస్తోంది. వాహనానికి బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, చిన్నపాటి మరమ్మతులకు ఈ మొత్తం ఉపయోగపడుతోంది. ఆటో, ట్యాక్సీవాలాల ఇబ్బందులను గమనించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద చేయూతనందిస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతల సాయం అందించగా ఐదో విడత సాయం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

జిల్లాలో లబ్ధి ఇలా..
గత ఏడాది జిల్లాలో వైఎస్సార్ వాహన మిత్ర కింద నాల్గవ విడతగా 4,285 మంది లబ్ధిదారులకు రూ.4.28 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. నాలుగు విడతల్లో ఒక్కో లబ్ధిదారు రూ.40 వేల లబ్ధి పొందారు. ఈ ఏడాది ఐదో విడత సాయానికి సంబంధించి ఇప్పటికే రవాణా శాఖ అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి అర్హుల జాబితాను ప్రభుత్వానికి సమర్పించారు. ఈసారి జిల్లాలో 4,607 మంది లబ్ధిదారులు ఉండగా వారి ఖాతాల్లో రూ.4.6 కోట్ల నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమ చేయనున్నారు.

కొత్తవారికి అవకాశం...
వైఎస్సార్ వాహనమిత్ర పథకం 2023–24 లబ్ధిదారులను ఈ ఏడాది కొత్తవారికి అవకాశం కల్పిస్తూ సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవడానికి అహ్వానించారు. ఆగస్టు 12వ తేదీ వరకు కొత్త దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశాలిచ్చారు. ఈ అవకాశాన్ని చాలామంది ఆటో, టాక్సీ డ్రైవర్లు వినియోగించుకున్నారు. కొత్తగా ఆటో, టాక్సీ, మాక్సీక్యాబ్ కొనుగోలు చేసిన డ్రైవర్లకు అవకాశం కలిసి వచ్చింది.

ఈ ఏడాది మండలాల వారీగా లబ్ధి ఇలా...			
మండలం	లబ్ధిదారులు	మండలం	లబ్ధిదారులు
బలిజిపేట	327	కురుపాం	220
భామిని	156	మక్కువ	242
గరుగుబిల్లి	239	పాచిపెంట	248
గుమ్మలక్ష్మీపురం	146	పాలకొండ	308
జియ్యమ్మవలస	250	పార్వతీపురం	712
కొమరాడ	315	సాలూరు	438
		సీతంపేట	254
		సీతానగరం	381
		వీరఘట్టం	371

అర్హతే ప్రామాణికం...
అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ వాహనమిత్ర పథకానికి లబ్ధిదారులను రాష్ట్రప్రభుత్వం పారదర్శకంగా ఎంపిక చేసింది. వాహన లబ్ధిదారులు తమ వాహనం వద్ద ఫొటోను గ్రామ, వార్డు సచివాలయంలో నమోదు చేసి దరఖాస్తు చేసుకున్నారు. కొత్త వాహనం కొనుగోలు చేసిన డ్రైవర్లు, ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు,భూమి వివరాలు, ఆదాయపన్ను, ఇంటి విద్యుత్ వినియోగం, కులం ఇతర వివరాలు సచివాలయలకు అందజేసి అర్హులుగా లబ్ధిపొందనున్నారు.

రేషన్ వాహనాలకూ..
ఈ ఏడాది రేషన్ డోర్ డెలివరీ చేస్తున్న రేషన్ వాహనాల (ఎండీయూ) ఆపరేటర్లకు కూడా వాహనమిత్ర సాయం అందించనున్నారు. ఈ మేరకు 196 లబ్ధిదారులుగా గుర్తించారు. వీరికి రూ.19.60 లక్షలు అందించనున్నారు.

చాలా సంతోషం



వైఎస్సార్ వాహనమిత్ర ఇప్పటికే నాలుగు విడతల్లో రూ.40 వేల సాయం పొందాను. ఈ ఏడాది మరో రూ.10 వేలు లబ్ధి అందుకుంటాను. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటప్రకారం క్రమం తప్పకుండా వాహనమిత్ర సాయం అందించడం సంతోషంగా ఉంది.
– గంగాడ రాము, ఆటో డ్రైవర్, పార్వతీపురం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ఏటా వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాయం అందించడం ఆనందంగా ఉంది. రూ.10 వేల సాయం నాకు ఎంతో ఉపయోగపడుతోంది. ఈ మొత్తాన్ని వాహనం బ్రేక్, బీమా, నిర్వహణ ఖర్చులకు ఉపయోగించుకుంటున్నాను.
–తవిటినాయుడు, ఆటోడ్రైవర్, కొత్తవలస

అర్హులందరినీ గుర్తించాం



జిల్లాలో వైఎస్సార్ వాహన మిత్ర ఐదో విడతకు సంబంధించి లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపికచేశాం. ఈ పథకం కింద 4,607 మంది లబ్ధిదారులకు రూ.4.6 కోట్ల లబ్ధి కలగనుంది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ వాహన మిత్ర పథకానికి ఎంపికచేశాం. ఆటో, మ్యాక్సీ, టాక్సీ డ్రైవర్లకు వాహనాల నిర్వహణ, ఇన్స్యూ ప్రీమియం, ఫిట్‌నెస్ ఫీజులు చెల్లించేందుకు పథకం ఆర్థికంగా దోహదపడుతోంది.
– మల్లికార్జున రెడ్డి, జిల్లా రవాణా అధికారి, పార్వతీపురం మన్యం

మెరుగైన వైద్యం

- డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

పాలకొండ రూరల్: ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బగాది జగన్నాథరావు సూచించారు. పాలకొండ ఏరియా ఆస్పత్రితో పాటు మండలలోని అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీలను గురువారం సందర్శించారు. అక్కడి వైద్యులతో సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధులను అధిగమించే చర్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఆరోగ్య కార్యక్రమాలపై సచివాలయాలవారీగా సమీక్షలు జరపాలని వైద్యులకు సూచించారు. గర్భిణులు, చిన్నారులు, కిశోరీ బాలికల్లో రక్తహీనతను అధిగమించే ప్రణాళికలు, ఈ-ఆశా యాప్‌లో పూర్తి వివరాల నమోదు, ఆస్పత్రి ప్రసవ కేసుల నమోదు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి, నోడల్ అధికారి వినోద్, సూపరింటెండెంట్ నాగభూషణరావు, వైద్యాధికారులు రవికుమార్, వి.కమల్‌నాథ్ తదితరులు ఉన్నారు.

మహిళా మార్ట్‌ల పరిశీలన

ఎస్.కోట/జామి: పీఎంఎఫ్‌ఈ, పీఎంఈజీపీ రుణాలతో మహిళా సంఘాలు నిర్వహిస్తున్న మహిళా మార్ట్‌లు, వివిధ స్వయం ఉపాధి యూనిట్లను ట్రైనీ ఐఏఎస్‌లు గురువారం పరిశీలించారు. జామిలో మహిళా సంఘాలు నిర్వహిస్తున్న అంబికా లేడీస్ టైలరింగ్, కంప్యూటర్ అంబ్రాయిడరీ వర్క్స్, ఎస్.కోటలోని మహిళా మార్ట్‌ను సందర్శించారు. యూనిట్ల నిర్వహణ, ఆదాయ వ్యయాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు.

డైట్ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

పార్వతీపురంటౌన్: డైట్ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదలైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 19, 2023 నుంచి జూన్ 24 వరకు నిర్వహించిన పరీక్షకు 3,885 మంది విద్యార్థులు హాజరుకాగా, 2,480 మంది (63.83 శాతం) ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు కళాశాల సమాచారం కోసం డమ్మీమెమోరాండం కోసం డబ్ల్యూడబ్ల్యూ.బీఎస్సీ.ఏపీ.జీఓవీ.ఇన్‌ను సంప్రదించాలన్నారు. మార్కుల రీకౌంటింగ్ కోసం ఈ నెల 9వ తేదీలోగా సీఎంఎఫ్ఎస్‌లో రూ.500 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కచ్చితమైన ఓటరు సర్వే

- తొలగించిన ప్రతీ ఓటు పరిశీలన
- ఓటరు జాబితాలో తప్పులు గమనిస్తే దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లాలో 7,70,144 మంది ఓటర్లు

పార్వతీపురం:

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో కచ్చితమైన ఓటరు జాబితాల రూపకల్పనకు ఇంటింటి ఓటరు సర్వే సాగుతోంది. తొలగించిన ప్రతి ఓటును పరిశీలించేందుకు ఇంటింటా ఓటరు విచారణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. దీనికోసం ప్రత్యేక అధికారులను కలెక్టర్ నిషాంత్‌కుమార్ నియమించారు.




ఉల్లిభద్రలో ఇంటింటి సర్వే చేస్తున్న బీఎల్‌ఓ

జిల్లాలో 7,70,144 మంది ఓటర్లు
జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 7,70,144 మంది ఓటర్లు ఉన్నారు. పాలకొండ నియోజకవర్గంలో 1,98,633 మంది ఓటర్లు ఉండగా 452 మంది ఓటర్ల వివరాలను పరిశీలించాల్సి ఉంది. కురుపాంలో 1,86,700 మంది ఓటర్లకు 98 మంది, పార్వతీపురంలో 1,87,815 మందికి 93 మంది, సాలూరు నియోజకవర్గంలో 1,97,825 ఓటర్లకు 822 మంది వివరాలు పరిశీలించాల్సి ఉంది.

- ఇంటింటి విచారణలో 4,622 మంది స్థానికంగా అందుబాటులో లేనట్టు బీఎల్‌ఓలు గుర్తించారు. వీరిలో పాలకొండ నియోజకవర్గంలో 1747 మంది, కురుపాంలో 446 మంది, పార్వతీపురంలో 1131 మంది, సాలూరులో 1298 మంది ఉన్నారు.
- స్వగ్రామాల నుంచి వివిధ ఉద్యోగాలు, పనుల కోసం శాశ్వతంగా వలస వెళ్లిపోయిన ఓటర్లు జిల్లాలో 3,213 మంది ఉన్నట్టు ఇంటింటి సర్వేలో తేలింది. అందులో పాలకొండ నియోజకవర్గంలో 1722 మంది, కురుపాంలో 244 మంది, పార్వతీపురంలో 836 మంది, సాలూరులో 411 మంది ఉన్నారు.
- వివిధ కారణాలతో మృతిచెందిన 13,994 మంది ఓటర్ల పేర్లు జాబితాలలో ఉన్నట్టు సర్వే సిబ్బంది గుర్తించారు. అందులో పాలకొండ నియోజకవర్గంలో 4,876 మంది, కురుపాం 2,457 మంది, పార్వతీపురంలో 2,824 మంది, సాలూరులో 3,837 మంది ఉన్నారు.
- జిల్లాలో 1861 మంది డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు అధికారులు సర్వేలో తేలింది.
- ఓటరు జాబితాలో దిద్దిబాటు కోసం ఫారం–8 కింద 60,535 దరఖాస్తులు అందాయి. ఇందులో పాలకొండ నియోజకవర్గంలో 18,752, కురుపాంలో 19,197, పార్వతీపురంలో 8,841, సాలూరు నియోజకవర్గంలో 13,745 దరఖాస్తులు వచ్చాయి.
- కొత్తగా ఓటరు నమోదు కోసం ఫారం–6 కింద 16,686 దరఖాస్తులు అల్దాయి.
- ఫారం–7 కింద 17,920 దరఖాస్తులు వచ్చాయి.
- ఏప్రిల్ 15 నుంచి ఆగస్టు 29 వరకు జిల్లాలో 3,365 మంది ఓటర్లు కొత్తగా చేరారు. ఇందులో పాలకొండ నియోజకవర్గంలో 2,182 మంది, కురుపాం 460, పార్వతీపురంలో 447, సాలూరులో 276 మంది కొత్త ఓటర్లు చేరినట్టు అధికారులు గుర్తించారు.
- ఇంటింటి ఓటరు సర్వేలో 2,107 ఓట్లను తొలగించారు.
- జిల్లాలో 12,756 ఓట్ల చేర్పులు, మార్పులు జరిగాయి. ఇందులో పాలకొండ నియోజకవర్గంలో 10,668, కురుపాంలో 108, పార్వతీపురంలో 1876, సాలూరు నియోజకవర్గంలో 204 ఓట్లు ఉన్నాయి.
- ఓటరు జాబితాలో తప్పులు గమనిస్తే దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. తప్పులు గమనిస్తే తక్షణం బీఎల్‌ఓల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

తప్పులు లేని ఓటర్ల జాబితాకు చర్యలు



జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు చర్యలు చేపట్టాం. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు పునఃశ్చరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. సెప్టెంబర్ 29 నుంచి పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ జరుగుతుంది. 1500 ఓట్లు ఒక పోలింగ్ కేంద్రంలో ఉండేటట్లు చర్యలు చేపడుతున్నాం. ఒక వీధిలో ఉన్న కుటుంబాలు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.
– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

వేగవంతంగా ఇళ్ల నిర్మాణం

పార్వతీపురం:

జిల్లాలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్లనిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేసేలా లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఉత్తరాంధ్ర ప్రత్యేక అధికారి మహమ్మద్‌దివాన్ మైదీన్ అధికారులకు సూచించారు. పార్వతీపురంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలను గురువారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో గృహ నిర్మాణ సంస్థ అధికారులు, ఎంపీడీఓలు, ఇంజినీరింగ్ సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహ నిర్మాణాల్లో దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపుపొందిందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 5 లక్షల గృహాల నిర్మాణం పూర్తయినట్టు తెలిపారు. డిసెంబర్ నాటికి మరో 5 లక్షల ఇళ్లనిర్మాణం పూర్తిచేయాలన్నది లక్ష్యంగా పేర్కొన్నారు. గృహనిర్మాణాలను పూర్తిచేసి అవార్డుల సాధనకు ప్రయత్నించాలని సూచించారు.

- దేశవ్యాప్తంగా 50 లక్షల ఇళ్లు మంజూరు చేయగా, మన రాష్ట్రానికే 21 లక్షలు మంజూరైనట్టు మైదీన్ వెల్లడించారు. రాష్ట్రంలో రూ.50 వేల కోట్ల విలువగల ప్రభుత్వ భూమిలో ఇళ్లస్థలాల మంజూరుతో పాటు రూ.15 వేల కోట్ల ఖర్చుతో ప్రైవేటు భూములను కొనుగోలు చేసి ఇళ్లపట్టాలు అందజేసిందన్నారు. ఏటా ఇళ్ల నిర్మాణానికి రూ.15 వేల కోట్లను ప్రభుత్వం ఖర్చుచేస్తోందని తెలిపారు.



పార్వతీపురం: వైఎస్సార్ జగనన్న కాలనీని పరిశీలిస్తున్న గృహనిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి, ఉత్తరాంధ్ర ప్రత్యేక అధికారి మహమ్మద్ దివాన్ మైదీన్

- వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12 వేలు, ఉపాధి హామీ పథకం కింద 90 రోజుల పనిదినాలు కల్పించడం ద్వారా లబ్ధిదారుకు అదనంగా రూ.23 వేల వరకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రతి కాలనీలో ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. 25 గృహాలు దాటివున్న కాలనీలకు ఆర్చ్‌ల నిర్మించాలని సూచించారు. బిల్లులను నిర్దేశిత సమయంలో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. పనులపై శ్రద్ధవహించాలని ఇంజినీరింగ్ సహాయకులను ఆదేశించారు. సహాయ ఇంజినీర్లు బాధ్యతతో పర్యవేక్షించాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వస్తున్న అర్జీల పరిష్కారంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. పీఎంఏవై గ్రామీణ్‌కు ముందస్తుగానే రూ.40 వేలు అందించడం జరుగుతుందని చెప్పారు. ప్రగతిలో వెనుకబడిన మండలాలు నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఇంజినీరింగ్ సహాయకులు ప్రగతి వేగం పెంచాలన్నారు.
- కలెక్టర్ నిషాంత్ కుమార్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలలో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలో 4వ స్థానంలో ఉన్నట్టు వెల్లడించారు. జిల్లాకు మొత్తం 27,142 గృహాలు మంజూరుకాగా, 23,805 గృహనిర్మాణాలు చేపట్టామని, వీటిలో 11,844 గృహాల నిర్మాణం పూర్తయిందన్నారు. పునాదుల స్థాయిలో 5,227, రూఫ్ స్థాయిలో 1774, రూఫ్ కాస్టింగ్ స్థాయిలో 346 ఉన్నాయన్నారు. పునాదులు పూర్తయ్యే స్థితిలో 4,614 ఉన్నాయన్నారు. కాలనీల్లో రూ.5 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. రాబోయే మూడు, నాలుగు రోజుల్లో వంద ఇళ్లు పూర్తిచేసేలా ముందుకు సాగుతున్నామన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.63 లక్షలు విడుదల చేశామని తెలిపారు. ప్రణాళికాబద్ధమైన కృషితో లక్ష్యాల సాధన సులభమన్నారు. సమావేశంలో జేసీ ఆర్.గోవిందరావు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రమేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పైడితల్లి పండగ తేదీలు ఖరారు

- అక్టోబర్ 4న పందిరి రాట
- ఆ రోజునుంచే మండల దీక్షలకు శ్రీకారం
- అక్టోబర్ 30న తొలేళ్ల ఉత్సవం, 31న సిరిమానోత్సవం
- ఉత్సవ వివరాలు వెల్లడించిన ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి

విజయనగరం టౌన్: పసిడి తల్లి పండగ వస్తుందంటే అందరికీ ఆనందమే. ఆ తల్లి కరుణా, కటాక్ష వీక్షణాల కోసం ఎందరో భక్తులు వేచిచూస్తుంటారు. జీవితంలో ఒక్కసారైనా అమ్మ జాతరను కనులారా వీక్షించాలని పరితపిస్తుంటారు. సిరిమానోత్సవంలో పాల్గొని తల్లి ఆశీర్వాదం పొందుతారు. అంతటి ప్రాశస్త్యం కలిగిన పైడితల్లి నెలరోజుల పండగ రానే వచ్చింది. అందరినీ ఆనందపరవశంలో ముంచెత్తింది. రాష్ట్ర పండగగా గుర్తించడంతో అధికారయంత్రాంగమంతా అమ్మపండగకు రంగం సిద్ధం చేస్తోంది. పైడితల్లి అమ్మవారి కల్యాణమండపంలో ఈ ఏడాది పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలకు సంబంధించిన వివరాలను ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి గురువారం వెల్లడించారు. పండగను విజయవంతం చేయాలని భక్తులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ట్రస్టు బోర్డు సభ్యులు వి.శ్రీనివాసరావు, అచ్చిరెడ్డి, పి.వెంకటరావు, గంధం లావణ్య, గొర్లె ఉమ, వేదపండితులు తాతా రాజేష్, దూసి శివప్రసాద్, వెలువలపల్లి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పైడితల్లి

పండగ సాగేదిలా...
పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 4 నుంచి నవంబర్ 15వ తేదీ వరకూ ఉత్సవాలు జరగనున్నవి. అక్టోబర్ 4 బుధవారం ఉదయం 8 గంటలకు చదురుగుడి వద్ద మండల దీక్షలు ప్రారంభమవుతాయి. అదేరోజు చదురుగుడి ఆవరణలో ఉదయం 9.30 గంటలకు, వనంగుడి ఆవరణలో ఉదయం 11 గంటలకు పందిరిరాట వేసి ఉత్సవాలు ప్రారంభిస్తారు.

- అక్టోబర్ 25న బుధవారం అర్ధమండల దీక్షలు నిర్వహిస్తారు. 30న సోమవారం తొలేళ్ల ఉత్సవం, 31న మంగళవారం సిరిమాను ఉత్సవం జరిపేందుకు ముహూర్తం ఖరారు చేశారు.
- నవంబర్ 7న మంగళవారం పెద్దచెరువులో అమ్మవారి తెప్పోత్సవం, నవంబర్ 11న శనివారం సాయంత్రం 5.30 గంటలకు రైల్వేస్టేషన్ వద్ద వనంగుడి నుంచి అమ్మవారి కలశ జ్యోతుల ఊరేగింపు ఉంటుంది.
- నవంబర్ 14న మంగళవారం చదురుగుడి వద్ద ఉయ్యాల కంబాల మహోత్సవం, 15న బుధవారం వనంగుడి ఆవరణలో చండీహోమం, పూర్ణాహుతి, దీక్షావిరమణలు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతాయి.



అమ్మవారి జాతర తేదీలను ప్రకటిస్తున్న ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి, పాల్గొన్న ట్రస్టు బోర్డు సభ్యులు

క్లుప్తంగా

హుండీల చోరీకి విఫలయత్నం



ఎల్లారమ్మ ఆలయంలో హుండీని పరిశీలిస్తున్న క్లూస్ టీం

గంట్యాడ: ఆలయాల చోరీకి అగంతుకులు విఫలయత్నం చేశారు. మండల కేంద్రం గంట్యాడలో ఉన్న ఆంజనేయస్వామి, ఎల్లారమ్మ ఆలయాల్లో ఉన్న హుండీలను బుధవారం రాత్రి చోరీ చేసేందుకు దుండగులు విఫలయత్నం చేశారు. హుండీ తాళం రాకపోవడంతో ఆంజనేయస్వామి ఆలయంలో హుండీని తుప్పల్లో పడేశారు. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు చెప్పడంతో క్లూస్ టీంను రప్పించి ఆలయాన్ని, హుండీలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

ఆటోబోల్తా: నలుగురికి గాయాలు



108 వాహనంలో క్షతగ్రాతులను రాజాం తరలిస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని కాగితాపల్లి గ్రామ సమీపంలో గురువారం ఆటో బోల్తాపడి పలువురికి గాయాలయ్యాయి. వంగర మండలంలో ఓ శుభకార్యక్రమానికి శ్రీకాకుళం నుంచి వెళ్తున్న ప్రయాణికుల ఆటో మలుపువద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని తప్పించబోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ చిన్నారావు, అనకాపల్లి లక్ష్మి, కాలెపు సుజాత, దమ్మల ప్రియలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారికి 108 వాహనం పైలెట్ నారాయణరావు, ఈఎంటీ జగదీష్‌లు ప్రాథమిక చికిత్స అందించి రాజాం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై రేగిడి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

40 కోళ్ల అపహరణ

జామి: మండలకేంద్రం జామిలో కొత్తలివారి కల్లాల వద్ద భీమసింగి గ్రామానికి చెందిన మురళి మేలు జాతి కోళ్లను షెడ్డులో పెంచుకుంటున్నాడు. బుధవారం రాత్రి షెడ్డు తాళాలు పగలగొట్టి సుమారు 40 కోళ్లను దుండగులు అపహరించారు. దీంతో బాధితుడు గురువారం షెడ్డువద్దకు వచ్చి చూసేసరికి కోళ్లు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ కృష్ణారావు

పార్వతీపురం టౌన్: వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో బంగారం పుస్తెలతాడును ఓ దుండగుడు తెంచి పరారయ్యాడు. గురువారం వేకువ జామున జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మున్సిపాలిటీలోని వైకేఎం కాలనీకి చెందిన జవ్వాది మాధురి ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో వాకింగ్ చేస్తూ పువ్వులు కోస్తుండగా గుర్తు తెలియని దుండగుడు వెనకనుంచి వచ్చి పుస్తెలతాడు తెంపి పారిపోయాడు. దీంతో బాధిత మహిళ స్థానికుల సాయంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

చెక్ బౌన్స్ కేసులో జైలు శిక్ష

శృంగవరపుకోట: రెండు చెక్ బౌన్స్ కేసుల్లో ముద్దాయి సునీల్‌కుమార్ జైన్‌కు ఆర్నెలలు చొప్పున జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సబ్బవరపు వాణి గురువారం తీర్పు చెప్పారు. ఒక కేసులో రూ.11,47,000, మరో కేసులో రూ9,09,000 పరిహారం తొమ్మిది శాతం వడ్డీతో చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. చెల్లని చెక్‌లు పొంది నష్టపోయిన బాధితుల తరఫున సీనియర్ న్యాయవాది టీటీవీ రమణాజీ వాదనలు వినిపించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి.10గ్రా.)	60,380–00
బంగారం(22సి.10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹144	₹258	₹ 268

హరికథకు ఆద్యుడు ఆదిభట్ల

- నారాయణ దాసు 159వ జయంతోత్సవాలు ప్రారంభం
- ఆకట్టుకున్న కపిలేశ్వరపురం విద్యార్థుల హరికథాగానం



వెన్‌లాక్ లైబ్రరీలో ఆదిభట్ల విగ్రహానికి పూలమాలాంకరణ చేస్తున్న ఆరాధనోత్సవ సంఘం ప్రతినిధులు

విజయనగరం టౌన్: హరికథకు ఆద్యుడు, సంగీత సాహిత్య సార్వభౌమ, లయబ్రహ్మ, ఆటపాటల మేటి హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 159వ జయంతి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదిభట్ల నారాయణదాసు ఆరాధనోత్సవ సంఘం ఆధ్వర్యంలో విజయనగరంలోని కానుకుర్తివారి వీధిలో ఉన్న ఆదిభట్ల గృహంలో తొలుత పూజలు నిర్వహించారు. అనంతరం వెన్‌లాక్ పార్కులో, సంగీత కళాశాలలో ఉన్న ఆయన విగ్రహాలకు పూలమాలాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ర్యాలీగా లయన్స్ కమ్యూనిటీ హాల్‌కి చేరుకున్నారు. వేదిక వద్ద ఆదిభట్ల నారాయణ దాసు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా కపిలేశ్వరపురం శ్రీ సర్వారాయ హరికథా పాఠశాల విద్యార్థినులు పి.హరిప్రియ 'శ్రీరామ జననం', ఎస్.శిల్ప సుభద్రా కల్యాణం హరికథలను చెప్పి, ఆహుతుల ఆశీస్సులందుకున్నారు. సాయంత్రం కార్యక్రమంలో హరికథాచూడామణి కాళ్ల నిర్మల భాగవతారిణి ఆలపించిన సీతా కల్యాణం హరికథ ఆద్యంతం ఆకట్టుకుంది. సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి హాజరయ్యారు. కార్యక్రమానికి ఎ.రంగారావు దొర అధ్యక్షత వహించారు. అనంతరం హరికథా చూడామణి వై.శిఖామణి భాగవతారిణి నిర్వహించిన భక్త ప్రహ్లాద కథాగానం చూపరులను కట్టిపడేసింది. ఆరాధనోత్సవ సంఘం ప్రతినిధులు డాక్టర్ ఎ.గోపాలరావు, పీవీ.నరసింహరాజు (బుచ్చిబాబు) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భోగరాజు సూర్యలక్ష్మి, కాళ్ల నిర్మల, అప్పసాని రంగారావు దొర, కపిలేశ్వరపురం శ్రీ సర్వారాయ హరికథ పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.సింగరాచార్యులు, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

సంగీత కళాశాలలో ఆదిభట్ల జయంతి

మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఆదిభట్ల జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీఎల్ఎస్.శాస్త్రి ఆయన విగ్రహానికి పుష్పమాలాంకరణ చేశారు. అనంతరం కళాశాల తొలి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆదిభట్లను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో విగ్రహానికి పూలమాలాంకరణ చేస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రి



లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో హరికథా గానం చేస్తున్న సర్వారాయ హరికథా పాఠశాల విద్యార్థిని

సకల కళా స్వరూపుడు ఆదిభట్ల

సకల కళా స్వరూపుడు ఆదిభట్ల నారాయణ దాసు అని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ పేర్కొన్నారు. హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 159వ జయంతిని పురస్కరించుకుని శ్రీ ఆదిభట్ల ఫౌండేషన్ ఆనందనారాయణదాసు ఆధ్వర్యంలో ఆదిభట్ల గృహంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆదిభట్ల మనుమరాలు కామేశ్వరమ్మ దాసు విగ్రహానికి పూలమాలలేసి వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్ మాట్లాడుతూ సంగీత సాహిత్యాలను ఔపోసన పట్టిన సరస్వతీ స్వరూపమని ఆదిభట్లను కొనియాడారు. అనంతరం సాహితీవేత్త డాక్టర్ ఎ.గోపాలరావు, ప్రముఖ హరికథకులను, కళాకారులను ముఖ్య అతిథి కృష్ణమోహన్, సత్కరించారు. కార్యక్రమంలో ఆనంద నారాయణదాసు, మంజూష, రాజ్యలక్ష్మి, గురజాడ ఇందిర, హిమబిందు, సూర్యనారాయణ, పద్మనాభం, సూర్యకాంతి, తదితరులు పాల్గొన్నారు.



ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్‌ను సత్కరిస్తున్న ఆదిభట్ల ఫౌండేషన్ ప్రతినిధులు

కారు ఢీకొని యువకుడి మృతి

భోగాపురం: మండల కేంద్రంలోని సుందరపేట జాతీయ రహదారిపై గురువారం కారు ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరంలోని దాసన్నపేటకు చెందిన మల్లేడ నారాయణరావు(35) సొంత పనుల నిమిత్తం టీవీఎస్ బైక్‌పై భీమిలి మండలం చిప్పాడ వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి విజయనగరం వెళ్తుండగా సుందరపేట చేరుకునేసరికి శ్రీకాకుళం నుంచి ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో నారాయణరావు తీవ్ర గాయాలపాలవడంతో కారు డ్రైవర్ విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని తండ్రి వెంకటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

మరో ప్రమాదంలో కారు ఢీకొని మహిళ..

మండలంలోని సవరవిల్లి జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం కారు ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. సవరవిల్లి గ్రామానికి చెందిన బోర దుర్గమ్మ(54) జాతీయ రహదారి దాటుతుండగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి కుమారుడు బంగారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..

కొమరాడ: మండలంలోని గుమడ, కూనేరు రైల్వేస్టేషన్ల మధ్య గురువారం జంబోలైన్‌పై గుర్తుతెలియని వ్యక్తిని గూడ్స్ ట్రైన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై స్థానికుల సమాచారం మేరకు పార్వతీపురం రైల్వేపోలీసులు ఆరాతీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చీపురుపల్లి రూరల్: మృతిచెందిన వెంకటరమణ

బైక్ అదుపుతప్పి

చీపురుపల్లి రూరల్: చీపురుపల్లి మండలం బెవరపేట జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయి శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం పెద్ద లింగాలవలస గ్రామానికి చెందిన భోగి చినవెంకటరమణ(34) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ఈ ప్రమాదానికి సంబంధించిన మృతుని సోదరుడు లక్ష్మునాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటరమణ వైజాగ్‌లోని పరవాడలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ గాజువాకలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఇటీవల చీపురుపల్లి మండలంలోని ముల్లుపేట గ్రామంలో గల బంధువుల ఇంట్లో వివాహానికి హాజరయ్యాడు. వివాహం అనంతరం బుధవారం రాత్రి 12గంటల తరువాత స్వగ్రామం పెద్ద లింగాలవలసకు బైక్‌పై వస్తుండగా బెవరపేట జంక్షన్ వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న బంటాలో పడిపోయి మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

240 లీటర్ల సారా సీజ్

- ఇద్దరి అరెస్ట్
- మరో ఇద్దరిపై కేసు నమోదు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలం ములగ గ్రామంలో సారారవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రం నుంచి ఆంధ్రా ప్రాంతానికి సారా రవాణా జరుగుతుండగా 80 లీటర్ల సారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి పార్వతీపురం మండలం తానవలస గ్రామానికి చెందిన మండంగి చిన్నారావును అరెస్టు చేశారు. మరో సంఘటనలో పార్వతీపురం మండలం కృష్ణపల్లి గ్రామ సమీపంలో 160 లీటర్ల సారాతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, పార్వతీపురం మున్సిపాలిటీ పాతరెల్లివీధికి చెందిన రాయిపల్లి జెన్నును అరెస్టు చేశారు. ఈ రెండు కేసులకు సంబంధించి మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడుల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర, ఎస్సై వీవీ రమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న సారాతో సీఐ ఉపేంద్ర

ముగ్గురు వీఆర్‌వోల సస్పెన్షన్

పాచిపెంట: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న ముగ్గురు వీఆర్‌వోలపై కలెక్టర్ నిషాంత్‌కుమార్ సస్పెన్షన్ విధించినట్లు తహసీల్దార్ ఎం.రాజశేఖర్ గురువారం తెలిపారు. మాతుమూరు వీఆర్వో కె.సూర్యనారాయణ, పాచిపెంట–1 వీఆర్వో శంకరరావు, అలాగే విధులకు గైర్హాజరవుతున్న పాచిపెంట–2 వీఆర్వో విజయానంద్‌లు సస్పెన్షన్‌కు గురైనట్లు చెప్పారు.

పీఎస్ నాయుడు పలువురికి ఆదర్శం

- సెంచూరియన్ చాన్స్‌లర్ జీఎస్ఎన్ రాజు



అంతర్జాతీయ అథ్లెటిక్ నాయుడు దంపతులను సత్కరిస్తున్న చాన్స్‌లర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: సమాజంలో అందరికీ మార్గదర్శకంగా నిలిచిన పున్నపురెడ్డి సన్యాసినాయుడు ఆదర్శ ప్రాయుడని సెంచూరియన్ వర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. ఇటీవల శ్రీలంకలోని కొలొంబో రాజపక్షే స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పోల్‌వాల్ట్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన సన్యాసినాయుడిని టెక్కలి వర్సిటీలో గురువారం ఘనంగా సన్మానించారు. పట్టుదలతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన నాయుడిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా చాన్స్‌లర్ సూచించారు. కార్యక్రమంలో వీసీ పీకే మహంతి, వర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల చెల్లింపులకు పేటీఎం మిషన్‌ల పంపిణీ

విజయనగరం అర్బన్: జిల్లాలోని మహిళా పొదుపు సంఘాల స్త్రీనిధి రుణాల చెల్లింపులకు పేటీఎం మిషన్‌లను వినియోగంలోకి తెస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి అన్నారు. స్త్రీనిధి రుణాలు, వసూళ్లు మరింత పురోభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా పేటీఎం వ్యవస్థను తీసుకొస్తున్నామని చెప్పారు. జిల్లాను పైలెట్ కింద ప్రభుత్వం తీసుకుందన్నారు. తొలిదశలో ఎంపిక చేసిన మండలాలకు గురువారం ఆయన తన చాంబర్‌లో పేటీఎం మిషన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల నుంచి స్త్రీనిధి రుణ చెల్లింపులను పేటీఎం మిషన్ల ద్వారా అమలు చేస్తామని తెలియజేశారు. పైలెట్ కింద ముందుగా నెల్లిమర్ల, జామి, రేగిడి ఆముదాలవలస మండలాలకు పేటీఎం మిషన్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం ఎ.ఉమామహేశ్వరరావు, గరివిడి ఏరియా కో ఆర్డినేటర్ బి.బంగారమ్మ, డీపీఎం (ఐబీ), జె.లక్ష్మునాయుడు, నెల్లిమర్ల మండల ఏపీఎం, ఎల్.సత్యనారాయణ, స్త్రీనిధి మేనేజర్ కె.రమేష్ పాల్గొన్నారు.



పేటీఎం మిషన్ ద్వారా రుణాల చెల్లింపుల విధానాన్ని పరిశీలిస్తున్న పీడీ కల్యాణ చక్రవర్తి

ప్రతిభా విద్యార్థులకు కెనరాబ్యాంక్ ప్రోత్సాహకం

సాలూరు: మండలంలోని కురుకూటి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థినులకు స్థానిక తోణాం కెనరాబ్యాంక్ అధికారులు నగదు ప్రోత్సాహకాలు అందించి అభినందించారు. ఈ మేరకు హెచ్‌ఎం ఆశారాణి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలుస్తూ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు బ్యాంకు మేనేజర్ ప్రసాద్ శాఖాపరంగా నగదు ప్రోత్సాహకాలను అందించి అభినందించారు. 6,7 తరగతుల విద్యార్థి నులకు చెరో రూ.2,500, 8,9,10 తరగతుల విద్యార్థినులకు రూ.5వేలు చొప్పున నగదును అందించారు. బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నామని మేనేజర్ తెలిపారు.



విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు అందించి అభినందిస్తున్న బ్యాంకు మేనేజర్ ప్రసాద్, పక్కన హెచ్‌ఎం ఆశారాణి

సోదర భావం టీచర్ల నుంచి అలవరచుకోవాలి



ఉపాధ్యాయులతో డీఈఓ లింగేశ్వరరెడ్డి

- డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి

విజయనగరం అర్బన్: పాఠశాలల్లో ఉపాధ్యాయులంతా సోదర భావంతో పనిచేయాలని ఆలాంటి పరిసరాలను చూసి బాలబాలికలు స్ఫూర్తి పొందుతారని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం జరిగిన రాఖీ పండగ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భిన్న భాషలు, మతాలు, కులాల ప్రజల మధ్య ఐక్యతను సోదరభావం పెంపొందిస్తుందన్నారు. విజ్ఞాన వేదిక కన్వీనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓలు రాజు, సత్యవతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు రామునాయుడు, సత్యనారాయణ, వై.అప్పారావు, శ్రావణకుమార్ పాల్గొన్నారు.

అధునాతన అంబులెన్సులతో వైద్య సేవలు

- జిల్లాలో 28 వాహనాలు
- ఫోన్ చేసిన నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి హాజరు

విజయనగరం ఫోర్ట్: గత ప్రభుత్వం హయాంలో శిథిలావస్థకు చేరిన 108 అంబులెన్సులకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్వ వైభవం తీసుకువచ్చింది. అంతేకాకుండా శిథిలావస్థలో ఉన్న వాహనాలు అన్నింటిని మార్చేసి అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్సులను అందుబాటులోకి తెచ్చిందిజ ఆస్పత్రికి చేరే లోపే రోగులకు చికిత్స అందడంతో అనేక మంది పునర్జన్మ పొందుతున్నారు.

జిల్లాలో 28 వాహనాలు

జిల్లాలో 108 అంబులెన్సులు 28 ఉన్నాయి. వాటిలో రెండు అంబులెన్సులు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు వాహనాలు. ఒకటి నవజాత శిశువులకు సేవలు అందించే నియోనేటల్ అంబులెన్సు. మిగిలిన 25 లైఫ్ సపోర్టు అంబులెన్సులు.



108 అంబులెన్సు

హుటాహుటిన సంఘటన స్థలానికి

ఆపదలో ఉన్నామని ఫోన్‌రాగానే 108 అంబులెన్సు సంఘటనా స్థలానికి హుటాహుటిన వాలిపోతుంది. పట్టణ ప్రాంతంలో 15 నుంచి 16 నిమిషాల్లో.. గ్రామీణ ప్రాంతాల్లో 20 నుంచి 22 నిమిషాల్లో అంబులెన్సు సంఘటనా స్థలానికి చేరుకుంటుంది. సకాలంలో ఆస్పత్రికి చేర్చడం వల్ల వల్ల ఎంతో మంది ప్రాణాపాయస్థితి నుంచి బయట పడుతున్నారు. కరోనా సమయంలో కూడా 108 అంబులెన్సులు నిర్విరామంగా సేవలు అందించాయి. 7 నెలల కాలంలో 22. 253 మందిని ఆస్పత్రికి చేర్చాయి.

రోగి కోరుకున్న ఆస్పత్రికి తరలింపు

ఇంటి దగ్గర ఉన్న రోగి ఏ ఆస్పత్రి కోరుకుంటే ఆ ఆస్పత్రికి 108 అంబులెన్సులో తరలిస్తారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు సంబంధిత వైద్యుడు ఏ ఆస్పత్రికి రిఫర్ చేస్తే ఆ ఆస్పత్రికి మాత్రమే తరలిస్తారు. 108 అంబులెన్సుల్లో . గర్భిణిని ఆస్పత్రికి తరలించే సమయంలో పురిటి నొప్పులు ఎక్కువైతే మార్గమధ్యంలో సిబ్బంది ప్రసవం జరిపిస్తున్నారు.



బొండపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న వాహనం (ఫైల్)



గర్భిణికి ప్రసవం జరిపించిన 108 సిబ్బంది (ఫైల్)

సకాలంలో వైద్యం అందేలా చూస్తున్నాం



108కు ఫోన్ రాగానే సకాలంలో అంబులెన్సును పంపించి ఆస్పత్రికి చేరుస్తున్నాం. నవజాత శిశువుల వైద్యం కోసం కూడా నియోనేటల్ అంబులెన్సును వినియోగించుకుంటున్నారు. రోగుల ప్రాణాలు కాపాడాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సేవలు అందిస్తున్నాం.

– నజీర్ హుస్సేన్, 108 జిల్లా మేనేజర్

ఘనంగా విశ్వ సంస్కృత భాషా దినోత్సవం



జక్కు రామకృష్ణను సన్మానిస్తున్న నిర్వాహకులు

విజయనగరం అర్బన్: నగరంలోని మహరాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విశ్వ సంస్కృత భాషా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హంస అవార్డు గ్రహీత, బహు గ్రంథకర్త జక్కు రామకృష్ణను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఉభయ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్దననాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శుభ, సంస్కృత కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.గౌరీశ్వరరావు, అధ్యాపకులు టి.రమణ, డాక్టర్ ఎం.ఉమామహేశ్వరరావు, ఎం.రమాగీతాదేవి, బి.సులోచన, సీహెచ్ గంగా భవానీ, విద్యార్థులు పాల్గొన్నారు.